

ఆలయ కమిటీ సభ్యులకు చెక్కును అందజేస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి, అంజలియాదవ్

అయ్యప్ప స్వామి ఆలయానికి విరాళం

పేట్‌బషీరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆలయాలను అభివృద్ధి పరుచుకోవడానికి ముందుకు రావాలని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ రాఘవేంద్ర కాలనీలోని ఆలయంలో పంచలోహ అయ్యప్ప స్వామి పూజల్లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు గంగుల అంజలియాదవ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంజలియాదవ్ దేవాలయానికి విరాళంగా రూ.51 వేల చెక్కును హన్మంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అంద జేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఫతేనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అశ్వితా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (అస్కా) ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ కార్యదర్శి పాపారావు ఒక ప్రకటనలో తెలిపారు. కేపీహెచ్‌బీ 13 ఫేస్, అశ్వితారెసిడెన్సీ, క్లబ్ హౌజ్ ఇంటరాక్షన్ స్పేస్, (ఇందు ప్రాజెక్టుపక్కన) హఫీస్‌పేట్ రోడ్డులో ఈ శిబిరం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని అన్నారు. శిబిరానికి ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలోజీ(ఏఐజీ) ఆసుపత్రి వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని ఆయన సూచించారు. ఈ సదవకాశాన్ని అశ్వితా రెసిడెన్సీ నివాసితులు, స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేణుకా ఎల్లమ్మ సహిత నాగ దేవత విగ్రహ పునః ప్రతిష్ఠ

గచ్చిబౌలి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్ ఆదర్శ్‌నగర్ కాలనీలోని రేణుక ఎల్లమ్మదేవత సహిత నాగ పునఃప్రతిష్ఠలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు రామస్వామియాదవ్, లక్ష్మీనగర్‌నారాయణగౌడ్, రాజేశ్వరమ్మ, మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, నాయకులు మిరియాల రాఘవరావు, రమణమూర్తి, కరుణాకర్‌గౌడ్, మల్లారెడ్డి, పద్మారావు, లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడిగా సదానందం

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా ఆకుల సదానందం(వరంగల్) ఎన్నికయ్యారు. ఈ సమాఖ్యకు డాక్టర్ కె.వి.రమణాచారి(రిటైర్డ్ ఐఏఎస్) గౌరవ సలహాదారుగా వ్యవహరించనున్నట్లు సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రాంచంద్రరావు తెలిపారు. రవీంద్రభారతిలో జరిగిన సమాఖ్య సర్వసభ్య సమావేశంలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సదానందం, ప్రధాన కార్యదర్శిగా సాదు శ్యామ్‌ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా మారంరాజు రాంచందర్‌రావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా వరకవుల దుర్వాసరాజు, కోశాధికారిగా నామ సూర్యవర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు.



చందానగర్ తుల్జాభవాని అమ్మవారి ఆలయంలో శుక్రవారం రాష్ట్ర ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్ ప్రత్యేక పూజలు చేశారు.
-చందానగర్, ఆంధ్రజ్యోతి

బాలుడి అదృశ్యం



సాయికిరణ్

రాయదుర్గం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడు అదృశ్యమైన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ నెల 16న శివాజీనగర్‌లో నివాసం ఉండే కనకమహాలక్ష్మి కుమారుడు సాయికిరణ్ (8) ఇంటిముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. బాలుడి కోసం కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా జాడ తెలియకపోవడంతో శుక్రవారం రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు.

పోలీసుల అదుపులో ఉన్న చైన్ స్నాచర్ పరారీ

హైదర్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలోని గొలుసు లాక్కెళ్లిన కేసులో పోలీసుల అదుపులో ఉన్న దొంగ పోలీస్‌స్టేషన్ గోడ దూకి పరారయ్యాడు. ఈ నెల 12న ఉదయం వాకింగ్ వెళ్తున్న మల్లవ్వ అనే మహిళ మెడలో నుంచి ఓ గుర్తుతెలియని వ్యక్తి చైన్ లాక్కెళ్లిన సంగతి విదితమే. దీనిపై మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గురువారం కేపీహెచ్‌బీలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అభినవ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు చైన్ స్నాచర్‌గా గుర్తించారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితుడిని కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. సాయంత్రం టాయిలెట్‌కు వెళ్తానని చెప్పిన అభినవ్ పోలీస్ స్టేషన్ వెనకకు వెళ్లి కానిస్టేబుల్ కళ్లుగప్పి ఒక్కసారిగా గోడ దూకి పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఏసీపీ శ్రీనివాసరావు, బాలానగర్ డీసీపీ టి.శ్రీనివాసరావు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అదుపులో ఉన్న దొంగ గోడదూకి పారిపోవడంతో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై డీసీపీ అంతర్గత విచారణకు ఆదేశించనట్లు సమాచారం.

హాషిష్ ఆయిల్ విక్రయిస్తున్న ఇద్దరు రిమాండ్

గాజులరామారం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆషీస్ ఆయిల్ విక్రయిస్తున్న ఇద్దరిని బాలానగర్ ఎస్‌ఓటీ, సూరారం పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం సూరారం ఎక్స్ రోడ్డులో ఎస్‌ఓటీ, సూరారం పోలీసులు సంయుక్తంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను ఆపి తనిఖీ చేయగా ఆటోలో 650 గ్రాముల ఆషీస్ ఆయిల్ దొరికింది. ఆటో డ్రైవర్ ముద్ర కోల జీవన్, శ్రీనివాస్ ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా ఆషీస్ ఆయిల్‌ను అరకు నుంచి తీసుకొచ్చి రద్దీ ప్రాంతాల్లో విక్రయిస్తునట్లు పోలీసులకు వివరించారు. ఆటోను సీజ్‌చేసి ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పంచాయితీ అనుమతి పేరుతో...

అక్రమ లే అవుట్

అడ్డుకున్న మున్సిపల్ అధికారులు



వెంచర్‌లో హద్దురాళ్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

దుండిగల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ గాగిల్లాపూర్ గ్రామం మున్సిపాలిటీ ఏర్పడిన తరువాత కూడా ఓ బిల్డర్ త్రినీటి సిగ్నేచర్ పేరుతో సర్వే నంబరు 872లో 2.2 ఎకరాల భూమిలో పంచాయితీ లే అవుట్ సృష్టించి, 55 ప్లాట్లుగా చేసి, విక్రయాలు చేస్తున్నారు. ఒక్కొక్కటి 200 గజాల ప్లాట్లుగా చేసి, గజం రూ.30 వేల నుంచి 40 వేలకు విక్రయిస్తున్నారు. త్రినీటి సిగ్నేచర్ బ్రోచర్ పేరుతో కొనుగోలు దారులను ఆకర్షించడానికి బీటీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రతీ ప్లాట్‌కు మొక్కల పెంపకం, చుట్టూ కాంపౌండ్ నిర్మించి గేట్లు పెట్టడం, సెక్యూరిటీ రూమ్ నిర్మాణం, బోర్లు వేయించడం, వాటర్ సంప్ నిర్మాణం వంటి సౌకర్యాలు కల్పిస్తామని బ్రోచర్ రూపొందించి కొనుగోలు దారులను ఆకర్షిస్తున్నారు. ఈ లే అవుట్‌కు దగ్గరలో టెక్ మహేంద్ర, ఎంఎల్ఆర్ఐటీ, ఎరోనాటికల్ కళాశాలలు, తొమ్మిది కిలో మీటర్ల దూరంలో అవుటర్ రింగ్ ఎగ్జిట్, మల్లారెడ్డి ఆస్పత్రి, మేడ్చల్ వైపు ఇంజనీరింగ్ కళాశాల, రాబోయే ఐటీ పార్కు వంటి వాటిని చూపిస్తూ కొనుగోలు దారులను ఆకట్టుకుంటున్నారు. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ కె. సత్యనారాయణరావు టీపీఓ సంజన, టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఆ వెంచర్‌ను పరిశీలించారు. అనంతరం ఎక్స్‌కవేటర్‌తో ప్లాట్ల కోసం ఏర్పాటు చేసిన హద్దు రాళ్లను పూర్తిగా తొలగించారు. గ్రామ పంచాయితీ లే-అవుట్ అనుమతులను నిలిపి వేసి నాలుగు సంవత్సరాలు గడుస్తుంది. అయినా ఇలా అక్రమంగా అనుమతి లేని లే అవుట్‌ను రూపొందించి అమాయక ప్రజలకు విక్రయించి, మోసం చేస్తున్నారని కమిషనర్ సత్యనారాయణ అన్నారు. మున్సిపల్ ఏర్పడిన నాటి నుంచి టీఎస్‌బీపాస్ ద్వారా అనుమతులు తెచ్చుకోవలసి ఉంటుందని, అలా అనుమతులతో తీసుకొని లే అవుట్ చేసిన ప్లాట్లను మాత్రమే ప్రజలు కొనాలి. తప్పుడు లే అవుట్‌లు సృష్టించి ప్రజలను మోసం చేసి ప్లాట్లను విక్రయిస్తున్న వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ సూచించారు. అసలు పంచాయితీ అనుమతి ఇతనికి ఎలా వచ్చింది. ఎన్ని ప్లాట్లను విక్రయించారు అనే వివరాలను రాబట్టి, లే అవుట్ సృష్టించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న హెలీకో కంపెనీ వైస్ చైర్ పర్సన్ వనిత దాట్ల

బీవీఆర్ఐటీలో సాంకేతిక ఉత్సవం

నిజాంపేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లిలోని బీవీఆర్ఐటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరగనున్న పదో జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం మేధాన్‌వేష్ 2కె24 పేరుతో శుక్రవారం ప్రారంభమైనది. ఈ సాంకేతిక ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన హెలీకో కంపెనీ వైస్ చైర్‌పర్సన్ వనిత దాట్ల ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ దేశానికి ప్రతిభ గల మహిళలు ఎంతో అవసరమన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ పదో సాంకేతిక ఉత్సవంలో విభిన్నమైన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సాంకేతిక ఉత్సవంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 30 కళాశాల విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు. ఈ జాతీయ స్థాయి పోటీల్లో 5 వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మేధాన్ వేష్2కె 24 సమన్వయ్ కర్త డాక్టర్ అమ్రితా, విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించండి: ఈటల



శ్రీరామ్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

దుండిగల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దేశం మొత్తం ఎన్నికలు జరుగుతున్నాయి. మొన్న జరిగిన ఎన్నికలు తెలంగాణ కోసం జరిగాయి. ఇప్పుడు జరిగే ఎన్నికలు దేశం కోసం, ధర్మం కోసం నరేంద్ర మోదీని మళ్లీ ప్రధాన మంత్రిని చేయాలని జరుగుతున్న ఎన్నికలని మేడ్చల్ మాల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉదయం దుండిగల్ మున్సిపాలిటీ శ్రీరామ్‌నగర్ కాలనీ వాసులతో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో ఎవరు పాలించినా కూడా గ్రామాల్లో మహిళలకు కనీసం టాయిలెట్స్ కూడా కట్టించలేదన్నారు.

ప్రధాన మంత్రి మోదీ ఆడ బిడ్డలు ఇబ్బందులు పడకూడదనే ఆలోచనతో వారి సదుపాయాల కోసం లక్షల రూపాయల బడ్జెట్ పెడుతున్నారన్నారు. జందన్ ఖాతాలను ఓపెన్ చేయించారు. రోడ్లపై వ్యాపారం చేసుకునే ప్రతీ ఒక్కరి దగ్గర ఎలాంటి చదువు రాని వారి దగ్గర కూడా డిజిటల్ సేవలను మనం చూస్తున్నాం అన్నారు. అందుకే ఈ సారి ఎన్నికల్లో నరేంద్ర మోదీని మళ్లీ ప్రధాన మంత్రిని చేయాలని, ఇక్కడ మల్కాజ్‌గిరిలో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని ఈటల రాజేందర్ కోరారు.

శ్రీరామ్‌నగర్‌కు ఈటల రాజేందర్ రాగానే మహిళలు హారతులతో స్వాగతం పలికారు. కాలనీ వాసులతో అల్పాహారం చేసిన అనంతరం ప్రచారాన్ని నిర్వహించారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు

పేట్‌బషీరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని రాఘవేంద్ర కాలనీలోని ఆలయంలో పంచలోహ అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ముగిసింది. మాజీ మంత్రి, బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్, మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నీటి వనరులను కాపాడుకోవాలి

● నీటిపై అవగాహన ర్యాలీ

రాయదుర్గం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకుని గచ్చిబౌలిలోని పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన ఇనిస్టిట్యూట్‌లో బిల్డింగ్ క్లైమెట్ రెసిలెన్స్ ఫర్ వాటర్ సెక్టార్ అనే అంశంపై శుక్రవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపునకు ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వాణిప్రసాద్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రాహుల్ బొజ్జ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటి వనరులైన చెరువులు, కుంటలు, నదులను కాపాడుకోవాలన్నారు. కాలనీల్లో, ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని భూగర్భ జలాలు పెంచుకోవచ్చన్నారు. సహజసిద్ధమైన వనరులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దీనిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.

అల్లాపూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ నీటి దినోత్సవాన్ని జలమండలి కూకట్‌పల్లి డివిజనల్ మేనేజర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అల్లాపూర్ డివిజన్‌లోని సున్నం చెరువు నుంచి గాయత్రి నగర్ గాంధీ విగ్రహం కూడలి వరకు జలమండలి సిబ్బంది, స్థానికులు కలిసి ర్యాలీగా వెళ్లారు, స్థానికులతో కలిసి శుద్ధ జలాల పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీజీఎం రవి మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడాలని, బైకులు, కార్లు కడిగి, శుద్ధ జలాల వృథా చేయవద్దన్నారు. అవగాహన కార్యక్రమంలో సెక్షన్ మేనేజర్ విలియం ప్రకాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మొగులయ్య, జలమండలి సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వాణిప్రసాద్, రాహుల్ బొజ్జ



గాయత్రీనగర్ గాంధీ కూడలిలో సమావేశమైన జలమండలి అధికారులు, సిబ్బంది

నిజాంపేట్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా సూరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నార్త్ సిటీ హైస్కూల్లో విద్యార్థులకు పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్‌ముదిరాజ్ నీటి పొదుపు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం వాడుకునే నీటి వృథా కాకుండా కాపాడుకుంటేనే రాబోయే తరానికి మనం మేలు చేసే వారమవుతామన్నారు. వర్షపు నీరు వృథా కాకుండా గతంలో నిర్మించిన ఇంకుడు గుంతలను ఉపయోగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

ఫీజుల భారం మాపై మోపొద్దు..

ప్రభుత్వానికి లేఖ రాయాలంటూ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ హాస్టల్ విద్యార్థుల వినతి

బకాయిలు చెల్లించకుంటే పరీక్షలకు అనుమతించలేమంటున్న కాలేజీ అధికారులు

హైదరాబాద్ సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ ఫీజులు మూడేళ్లు రాకపోవడంతో.. హాస్టళ్లలో ఉంటున్న తమను కాలేజీ అధికారులు సెమిస్టర్ పరీక్షలకు అనుమతించడం లేదని జేఎన్‌టీయూ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.6 కోట్ల బకాయిల భారాన్ని పేద కుటుంబాల నుంచి వచ్చిన తమపై మోపవద్దని ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు. ఈ మేరకు శుక్రవారం జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. పేరుకు పోయిన బకాయిల కారణంగా మెస్‌లను నడిపే పరిస్థితి లేదని హాస్టల్ నిర్వాహకులు అంటున్నారని, అర్ధాంతరంగా హాస్టల్స్ మూసివేస్తే తాము బజారున పడాల్సి వస్తుందని వారి ఇబ్బందులను రిజిస్ట్రార్ దృష్టికి తెచ్చారు.

కొత్తగా కొలువైన ప్రభుత్వం నుంచి బకాయిలు త్వరగా విడుదల చేసేలా యూనివర్సిటీ విద్యార్థుల తరపున సంబంధిత (బీసీ, ఎస్సీ, ఎస్టీ)సంక్షేమ విభాగాల ఉన్నతాధికారులకు లేఖలు రాయాలని విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు రంజిత్‌కుమార్, రాహుల్‌నాయక్, శివకృష్ణ, దిలీప్ తదితరులున్నారు.

హనుమత్‌వాహనంపై లక్ష్మీఅమ్మవారి ఊరేగింపు

భెల్‌కాలనీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): హనుమత్ వాహనంపై సర్వాంగసుందరంగా అలంకరించిన లక్ష్మీసమేత నృసింహస్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కనులపండువగా జరిగింది. భెల్ టౌన్‌షిప్‌లోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం లో వైభవంగా జరుగుతున్న మహాలక్ష్మీ హోమంలో భాగంగా శుక్రవారం దేవాలయ దశావతార మండపంలో ప్రధాన అర్చకుడు భార్గవ్ పర్యవేక్షణలో విశేషపూజలు జరిగాయి. స్వామివారి మూల విగ్రహానికి పంచామృతాభిషేకం, సహస్రకమలార్చన, సామూహిక కుంకుమార్చన, శ్రీ మంత్రజపం, శ్రీ మంత్రహోమం, శ్రీమహాలక్ష్మీమూల మంత్రహోమం జరిగాయి. సాయంత్రం నిత్యపూజలతో పాటు విష్ణుసహస్రనామపారాయణం, మంత్రజపం, వాహనసేవ నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో దేవాలయ కార్యవర్గ సభ్యులు, కార్మికులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మల్కాజిగిరికే అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు..

● మంజూరుకు తుమ్మల హామీ



పార్టీ శ్రేణుల నుద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర్‌రావు, చిత్రంలో పట్నం మహేందర్ రెడ్డి, సునీతారెడ్డి

తిరుమలగిరి మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో సీఎం కోటా కింద ఇందిరమ్మ ఇళ్లను అత్యధికంగా మంజూరు చేయిస్తానని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీనిచ్చారు. శుక్రవారం తిరుమలగిరిలోని జయలక్ష్మీ గార్డెన్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్న పట్నం సునీతారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వంలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యమయ్యాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటన్నింటినీ తిరిగి గాడిలో పెడుతామని తెలిపారు.

కేంద్రంలో రాబోయేది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. హైదరాబాద్‌కు కావాల్సిన వనరులు సాధించుకున్నామని, కంటోన్మెంట్ స్కైవేలను ఏర్పాటు చేయడానికి రక్షణ శాఖ ద్వారా అనుమతి పొందడం సీఎం రేవంత్ రెడ్డి ఘనతగా చెప్పుకోవచ్చన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, వెన్నెల, శ్రీగణేష్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిలు పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రంగా రవీందర్ గుప్తాకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



రోడ్డులో అడ్డంగా రాకపోకలకు రాళ్లను వేయించిన అధికారులు

ప్రభుత్వ భూమిలో వేసిన రోడ్డును తవ్వించిన అధికారులు

దుండిగల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): "ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ రోడ్డు" అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి బాచుపల్లి రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ సెలవులో ఉండగా డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్ ఆదేశాల మేరకు ఆర్ఐ, వీఆర్ఏలు ఎక్స్‌కలేటర్‌తో సర్వే నంబర్ 109 ప్రభుత్వ భూమిలో బిల్డర్ వేసిన అనుమతి లేని రోడ్డును తవ్వించారు. నిర్మాణదారులు ఆ రోడ్డు గుండా రకపోకలు సాగించలేని విధంగా తవ్వకాలు చేయించారు. తమ నిర్మాణాల కోసం ప్రభుత్వ భూమిని ఉపయోగిస్తే చట్ట పరమైన కేసులు నమోదు చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ హెచ్చరించారు. ఈ విషయం ఆర్ఐ దృష్టికి వచ్చినా పత్రికల్లో వచ్చే వరకు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు సిబ్బందికి ప్రభుత్వ భూమి కబ్జాల విషయం తెలియగానే అప్పటికప్పుడే అడ్డుకట్ట వేస్తే కబ్జాదారులకు గుణపాఠం అవుతుందని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యజమానులకు తెలియకుండా భూమి రిజిస్ట్రేషన్



సమావేశంలో బాధిత కుటుంబ సభ్యులతో కలిసి స్థలం ఈసీ సర్టిఫికెట్ చూపుతున్న కాంగ్రెస్ నాయకుడు జడ్సన్

పంజాగుట్ట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ అధికారులు నిబంధనలు తుంగలో తొక్కి జీవో 59 కింద అసలు భూమి యజమానులకు తెలియకుండా వారి భూమిని ఇతరుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసిన అధికారులు, వారికి సహకరించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బక్క జడ్సన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రస్తుతం బెంగళూరులో ఐటీ సంస్థలో ఉద్యోగం చేస్తున్న మాసబ్ ట్యాంక్‌కు చెందిన షీన్ రోస్, ఆమె భర్త థామస్‌తో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. కేరళకు చెందిన షీన్ రోస్ తల్లిదండ్రులు ఫాదర్ ఆంథోనీ మామ్పిల్లి, అల్ఫోన్సా మామ్పిల్లి దంపతులు కొన్ని సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి మాసబ్ ట్యాంక్‌లో మారియా ఎడ్యుకేషన్ సొసైటీని స్థాపించి సాక్రెడ్ హార్ట్ ప్రిపరేటరీ స్కూల్‌ని నడిపేవారన్నారు.

1983 నుంచి 1986 మధ్యలో శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం నవకల్పా పరిధిలోని సర్వే నెంబర్ 66/3లో వేసిన ఒక వెంచర్‌లో 300 గజాల చొప్పున ఉన్న 22 ప్లాట్లు కొనుగోలు చేశారన్నారు. రహదారి వెడల్పు, తదితర వాటి కింద మూడు ప్లాట్లు పోగా, 19 ప్లాట్లు అప్పటి నుంచి వారి ఆధీనంలోనే ప్లాట్లు ఉన్నాయని, అందులో పాఠశాల, అనాథ ఆశ్ర మం, ఇతర సేవా కార్యక్రమాలకు భవనాలు కట్టుదామని వారనుకున్నారన్నారు. భూముల ధరలు పెరగడంతో వీరి ప్లాట్లపై కొందరి కన్ను పడిందన్నారు. 2020 సంవత్సరం ఏప్రిల్, మే నెలలో ఫాదర్ ఆంథోనీ మామ్పిల్లి, అల్ఫోన్సా మామ్పిల్లి మృతి చెందారని, దీంతో హైదరాబాద్ డయాసిస్ కార్యదర్శి అల్లం ఆరోగ్యరెడ్డి మృతు లు, మారియా ఎడ్యుకేషన్ సొసైటీ పేరుతో నకిలీ పత్రా లు సృష్టించి రెవెన్యూ అధికారులు సహాయంతో గత సంవత్సరం జీవో 59 కింద ఆ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించుకుని, వేరే వారికి విక్రయించాడన్నారు.

ఇటీవల ఈసీ తీయగా ఈ విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణి తీసివేస్తామని చెప్పినా కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో విలువైన భూములకు రెక్కలు వస్తున్నాయన్నారు. అప్పటి సీఎస్ సోమేశ్ కుమార్, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ హయాంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని, సంబంధింత శేరిలింగంపల్లి తహసీల్దార్, అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమ వద్ద ఒరిజినల్ డాక్యుమెంట్లు ఉన్నాయని, తమకు తెలియకుండానే తమ ప్లాట్లను వేరే వారికి రిజిస్ట్రేషన్ చేసిన విషయంలో రాయదుర్గం పోలీసులను ఆశ్రయించామని షీన్ రోస్ తెలిపారు.

పార్ట్‌టైమ్ ఉద్యోగమని చెప్పి..

13.50 లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పార్ట్‌టైమ్ ఉద్యోగం ఇస్తామని, వర్క్‌ఫ్రమ్ హోమ్ పనిచేసి డబ్బులు సంపాదించొచ్చు అని చెప్పిన కేటుగాళ్లు నగరానికి చెందిన యువకుడి నుంచి రూ. 13.50 లక్షలు దోచుశారు. మోసపోయిన బాధితుడు లబోదిబో అంటూ హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళ్తే... డ్రీమ్ హోటల్ డెవలప్‌మెంట్ పేరుతో టెలీగ్రామ్ గ్రూపులో బాధితుడి నంబర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు యాడ్ చేశారు. ప్రముఖ హోటళ్లను ప్రమోట్ చేస్తూ పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తే డబ్బులు ఇస్తామని నమ్మించారు. అలా ప్రారంభంలో కొన్ని హోటళ్లను ఇచ్చి ఎలా ప్రమోట్ చేయాలో చెప్పారు. అలా 3 సెట్‌లుగా హోటళ్లను హోటళ్ల పేర్లు ఇచ్చి ప్రమోట్ చేయమన్నారు. అలా చేసినందుకు ఒక్కో సెట్‌కు రూ. 1000లు చెల్లించారు. ఆ తర్వాత అధిక మొత్తంలో లాభాలు పొందాలంటే.. డీలక్స్ ఆర్డర్స్‌లో తప్పనిసరిగా పెట్టుబడులు పెట్టాలని, అప్పుడే మీకూ అధిక మొత్తంలో లాభాలువస్తామని నమ్మించారు. దాంతో బాధితుడు మొదట రూ.25వేలు పెట్టుబడి పెట్టాడు. ఆ డబ్బుకు మంచి రిటర్న్ వచ్చినట్లు చూపించారు. ఆ తర్వాత రూ. 50వేలు పెట్టుబడి పెట్టాడు. అలా నెమ్మదిగా ముగ్గులోకి దింపిన నేరగాళ్లు బాధితుని నుంచి రూ. 13,57,288లు పెట్టించారు. డబ్బులు చేతికి అందిన వెంటనే నేరగాళ్లు బాధితునితో కాంటాక్టు కట్ చేశారు. దాంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో దూకి వాచ్‌మాన్ ఆత్మహత్య

కూకట్‌పల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వాచ్‌మాన్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన కూకట్‌పల్లిలో చోటు చేసుకొంది. కూకట్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం హస్తల్‌పూర్ గ్రామానికి చెందిన జానపాటి బాలయ్య(28) కూకట్‌పల్లిలోని శాతవాహననగర్‌లో నివాసముంటూ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా బాలయ్య ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నెల 21న మెడికల్ షాపునకు వెళ్తున్నానని చెప్పి కాలనీకి సమీపంలోని భీమునికుంట వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచే బంధువులకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకొంటున్నానని చెప్పి కుంటలో దూకాడు. శుక్రవారం ఉదయం బాలయ్య శవమై తేలడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.